క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన భోజనంతో పాటు విద్యార్థులకు అన్నిరకాల సదుపాయాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బత్తిని రవీందర్ గౌడ్, జంగ అనిల్‌కుమార్, చల్లూరి విష్ణువర్ధన్, బిట్ల సాయి తేజ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అందించడం లేదని, కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశబోయిన రాము యాదవ్, దొమ్మాటి వేణుగోపాల్, జూపాక శివమణి, రాపెల్లి రోహిత్, నాయకులు సందీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు: ఎంపీగా ప్రమాణస్వీకారం చేసి జై పాలస్తీనా అంటూ నినాదాలు చేసిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారత ప్రజల మనోభావాలను అగౌరవపరిచిన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, కలిగేటి ఎల్లయ్య, బొమ్మకంటి భాస్కరాచారి, గోపు అనంతరెడ్డి, వడ్లూరి రాజేంద్రాచారి, జొజ్జ తిరుపతి, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి కుమార్ అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఓనర్ యాదగిరి, డ్రైవర్ రాచపల్లి కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నేడు అభ్యాసనవర్గ సమావేశం

చొప్పదండి: పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో బుధవారం మాతృశక్తి, దుర్గావాహిని మండలశాఖ కార్యకర్తల ఒక్కరోజు అభ్యాసనవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంయోజిక శ్రీరామోజుల సంగీత, మండల సంయోజిక దండె లావణ్య, సహ సంయోజిక దూస లావణ్య, దుర్గావాహిని సంయోజిక తుమ్మ స్వాతి తెలిపారు. సత్సంగాల ఆవశ్యకత, బాల సంస్కార కేంద్రాల్లో చెప్పాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తామని, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

ప్రవేశాలు కల్పించాలి

చొప్పదండి: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అన్ని ప్రాంతాల విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని ఎంపీటీసీలు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, తోట కోటేశ్, గొల్ల సునంద కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పాఠశాల సమీపంలో సమీకృత సంక్షేమ వసతిగృహం ఉన్నందున ప్రాంతాలకు అతీతంగా బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశం కల్పించాలన్నారు. హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి ఈ విషయమై మాట్లాడుతూ.. ఆరో తరగతిలో ఇప్పటికే 50 మంది విద్యార్థులున్నారని, గదుల కొరతతో విద్యార్థులను చేర్చుకోలేదన్నారు. కార్యక్రమంలో సింగిరెడ్డి భూంరెడ్డి, మొగిలి మహేశ్, వెంకటేశ్, రాము, రవిపాల్గొన్నారు.

నేడు మహాధర్నా

చొప్పదండి: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం మహాధర్నా నిర్వహించనున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ తెలిపారు. ఎన్టీఆర్ చౌరస్తాలో ఉదయం పది గంటల నుంచి నిర్వహించే మహాధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని, సెంట్రల్ లైటింగ్ పనుల్లో కదలిక వచ్చేందుకు సహకరించాలని కోరారు.

మరమ్మతులు మరిచారు

- వెదిర గ్రామ శివారులో ప్రమాదకరంగా వంతెన
- ఆందోళనలో ప్రయాణికులు, వాహనదారులు
- రెండు వైపుల కూలిన రక్షణ గోడలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వెదిర గ్రామ శివారులో ప్రమాదకరంగా ఉన్న పురాతన వంతెన

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ శివారులో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పురాతన వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని, ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా కూలిపోవడంతో వాహనాలు అదుపుతప్పి పడిపోయే పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

80 ఏళ్ల క్రితం నిర్మాణం...

దాదాపుగా 80 ఏళ్ల కిందట సింగిల్ రోడ్డుగా ఉన్నప్పుడు వంతెన నిర్మించారు. ఇరవై ఏళ్ల క్రితం డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా దాని పక్కనే మరో వంతెనను నిర్మించారు. పాతవంతెనపై నుంచి కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే వాహనాలు, జగిత్యాల నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలు కొత్త వంతెనపై నుంచి ప్రయాణించేలా ఏర్పాట్లు చేశారు. కానీ పాత వంతెనకుమరమ్మతులు చేయడం మరిచిపోయారు.

పలుమార్లు ప్రమాదాలు...

పాత వంతెన మీది నుంచి వాహనాలు వెళ్తుండగా ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. భారీ వాహనాలు వంతెన రక్షణ గోడలను తగలడంతో రెండు వైపులా పూర్తిగా కూలిపోయాయి. అయినా అధికారుల్లో చలనం లేదు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న వంతెనకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడం, ఎప్పుడు ఏ వాహనం వంతెన కింద పడిపోతుందోనని వెదిర గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, వంతెనకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గోడలు కూలిపోయాయి



వాగుపైన ఉన్న పాతవంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రెండు పక్కల గోడలు కూలిపోయాయి. ఎప్పుడు ఏ వాహనం వంతెనపై నుంచి కింద పడుతుందో తెలియని పరిస్థితి. గతంలో ప్రమాదాలు జరిగాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నాం.

– తొరికొండ భూపతి, వెదిర

ప్రమాదకరంగా ఉంది



పాతవంతెన ప్రమాదకరంగా ఉందని, మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశాం. అధికారులు వంతెనను పరిశీలించాలి. తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

– వెన్న రాజమల్లయ్య, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి



గన్నేరువరం: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: నిరుద్యోగ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం నిరసన చేపట్టితహసీల్దార్ భిక్షపతికి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం రాష్ట్రం ఏర్పడితే నిరుద్యోగులు ఇంకా మోసపోతున్నారని, గత ప్రభుత్వం మాదిరిగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారమయ్యే నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గసభ్యుడు మచ్చ బాలరాజు, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ మచ్చ మురళీకృష్ణ, గట్టు కిషన్, జాడిగేపు వినయ్, అజయ్‌రెడ్డి, ప్రశాంత్, అజయ్, సాయి, సంతోష్, గౌతమ్, వెంకటేష్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. నోటిఫికేషన్లు జారీ చేయని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్, నాయకులు రవీందర్, సంతోష్, సదాచారి, శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, సాయికృష్ణ, ప్రతినవ్ రెడ్డి, ప్రశాంత్, కల్యాణ్, పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్‌యాదవ్ మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తూ వచ్చాయని ఆరోపించారు. నాయకులు కె. సురేశ్, ఆంజనేయులు, మహేశ్, అజయ్, వైదిక్, నరేశ్, బలరా, నరసింహారెడ్డి, కోటేశ్వర్ పాల్గొన్నారు.

‘రైతుభరోసా’పై ప్రత్యేక సమావేశాలు



గంగాధర: మాట్లాడుతున్న దూలం బాలగౌడ్

సైదాపూర్: రైతుల సూచనల మేరకే రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం అమలు చేయనుందని, అందుకు సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సభల్లో రైతులు సూచనలు చేయాలని చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో మాట్లాడారు. వెన్కెపల్లి సహకార సంఘం ఆవరణలో బుధవారం నిర్వహించే ఆహ్వాన సభకు మండలంలోని రైతులు హాజరుకావాలన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని ఇల్లందకుంట, భోగంపాడు, మల్యాల గ్రామాలల్లోని సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతువేదికల్లో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. అధికారులు రైతు భరోసాపై రైతుల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు. సాగులో ఉన్న పదెకరాల్లోని భూములకు సాయం అందివ్వాలని సూచించారు. రైతులను ఐటీ పరిగణనలోకి తీసుకోవద్దన్నారు. కేడీసీసీ జిల్లా వైస్ చైర్మన్ రమేశ్, సీఈఓలు ఆదిత్య,దేవేందర్,శ్రీనివాస్, తిరుపతి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కొంరెల్లి, రైతులున్నారు.

రామడుగు: రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో మంగళవారం రైతుభరోసాపై సంఘం అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలువురు రైతులకు పథకం అమలుపై వివిధ అభిప్రాయాలను తెలియజేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సహకారశాఖ ఎండీ జలలోద్దీన్ అక్బర్, మండల వ్యవసాయాధికారి యాస్మిన్, సంఘం కార్యదర్శి మల్లేశం, సంఘం డైరెక్టర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సంఘం సిబ్బంది, రైతులున్నారు.

గంగాధర: రైతుభరోసాకు పరిమితులు పెట్టకుండా సాగు చేసే భూములకు అందించాలని గంగాధర సహకార సంఘం అధ్యక్షుడు దూలం బాలగౌడ్‌తో పాటు పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ, సహకారశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎస్ నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నవధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ చంద్రలీల, పీయూ మేనేజర్ నిఖిత మాదవి రైతులతో మాట్లాడారు. పంటల అధిక దిగుబడి కోసం పిల్లిపెసర, శనగ, పెసర, బబ్బెర్లు, గోధుమలు, మొక్కజొన్న, రాగులు, సజ్జలు, జొన్నలు మొదలైనవి దుక్కిలో చల్లుకొని రెండు మూడు నీటి తడులు ఇచ్చి 45 రోజుల తర్వాత పూత దశలో దుక్కి దున్నడం ద్వారా భూమిలో కుళ్లి కంపోస్టు ఎరువు తయారై సేంద్రీయ కర్బనం పెరిగి మొక్కలకు పోషకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సాయికుమార్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ



బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సతీశ్

జమ్మికుంట: పట్టణంలోని అంబేద్కర్‌కాలనీ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్మడి సతీశ్ ఆధ్వర్యంలో ప్రముఖ పాన్ ఇండియా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ జన్మదినం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గుట్ల అఖిల్, వంశీ, శివ, నవీన్, మహేష్, దీపక్, సునీల్ పాల్గొన్నారు.

గర్షకుర్తిలో నేత్రవైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సత్యసాయి సేవాసమితి సహకారంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 95 మందికి పరీక్షలు చేసి 28 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. రక్తపరీక్షలు నిర్వహించి బుధవారం ఆపరేషన్లు చేయనున్నామని క్యాంపు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్, సమ్మయ్య, బుచ్చిరాములు, బాపురెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాస్, విజయేందర్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ



శంకరపట్నం: పరామర్శిస్తున్న మంత్రి పొన్నం

మానకొండూర్/శంకరపట్నం: మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గర్రెపల్లి శంకర్‌లింగం తల్లి రాజమ్మ, శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన సేవాదాత కరివేద సదాశివరెడ్డి ఇటీవల మృతిచెందారు. మృతుల కుటుంబ సభ్యులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. మంత్రి వెంట మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పెంచాల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునఃప్రారంభిస్తాం

జమ్మికుంట: పట్టణానికి చెందిన పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి సోదరుడు జర్నలిస్ట్ పత్తి విష్ణువర్ధన్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని డాల్ఫిన్ టీ ప్యాలెస్‌లో టీ తాగిన అనంతరం మాట్లాడారు. జమ్మికుంట–హైదరాబాద్‌కు గతంలో బస్సు సర్వీసు ఉండేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకుపోగా మళ్లీ పునరుద్ధరిస్తామని తెలిపారు. అంతేకాకుండా జమ్మికుంట– హుజూరాబాద్‌కు ఉదయం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పత్తి కృష్ణారెడ్డి, దేశిని కోటి, తుమ్మేటి సమ్మిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పొనగంటి మల్లయ్య, సుంకరి రమేశ్, గూడెపు సారంగపాణి, సాయిని రవి, పూదరిరేణుక శివకుమార్‌గౌడ్, సజ్జద్, కౌన్సిలర్లు బొంగోని వీరన్న, దేశిని సదానందం, రాయికంటి రాజు నాయకులు పాల్గొన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులతో కలిసి పరామర్శించారు. వెంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట, మోతె, గోలిరామయ్యపల్లి, కోరటపల్లి, షానగర్ ద్వారా రామడుగుకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ఎంపీపీ జవ్వాజీ హరీశ్ మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అగ్రి చైర్మన్ ఉప్పుల అంజనీ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చెత్త వేయొద్దంటూ వాహనాల అడ్డగింత

కరీంనగర్ కార్పొరేషన్: డంపింగ్‌యార్డ్ పరిసరాల్లో పడవేస్తున్న చెత్తతో ఇబ్బందులు పడుతున్నామని, ఇక్కడ చెత్తను పడవేయొద్దంటూ ఆటోనగర్ వాసులు నిరసన తెలిపారు. మంగళవారం నగరంలోని 9వ డివిజన్ ఆటోనగర్ వాసులు పలువురు డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తున్న నగరపాలకసంస్థ వాహనాలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా ప్రజలు మాట్లాడారు. డంపింగ్‌యార్డ్‌లో కాకుండా, బయట కూడా చెత్త వేస్తున్నారని, దీంతో తమకు దుర్గంధంతో పాటు వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు వస్తున్నాయంటూ ఆవేదన చెందారు. చెత్తను ఇక్కడ వేయొద్దంటూ డిమాండ్ చేశారు. వాహనాలను అడ్డుకున్నారనే సమాచారం అందుకున్న నగరపాలకసంస్థ శానిటేషన్ అధికారులు అక్కడికి వెళ్లి ఆందోళన కారులకు సర్ది చెప్పారు. డంప్‌యార్డ్‌కు వెలుపల చెత్త పడవేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

పీహెచ్‌సీలో శ్రమదానం



మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మంగళవారం శ్రమదానం చేపట్టారు. పీహెచ్‌సీ ఆవరణలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిసకావద్దు

శంకరపట్నం: మాదకద్రవ్యాల నిరోధక సైనిక పోరం ఏర్పాటు చేస్తామని ప్రజాసంఘాల నాయకుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో మంగళవారం ప్రజాసంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. యువత మత్తుపదార్థాలకు బానిసకావద్దంటూ గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈసమావేశంలో ఆరీఫ్, అభిలాశ్ , శ్రీనివాస్, రాజేందర్, హరీశ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

సైదాపూర్: దుద్దెనపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి మండల విద్యాధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సైదాపూర్ ఎంఈవోగా పని చేసిన కేతిరి వెంకటనర్సింహారెడ్డిని డీఈవో తొలగించి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. పర్మినెంట్ ఎంఈవోను నియమించక ఏళ్లు గడుస్తున్నాయని, ఐదు మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా వ్యవహరించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

వివాహిత ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్‌కు చెందిన వివాహిత మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొస్కుల సూర్యప్రకాశ్‌కు హన్మకొండ జిల్లాకు చెందిన కవితతో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భూమి విషయంలో భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేయగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలి

కరీంనగర్: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేసి అలాట్ అయిన స్థానాల్లో జాయిన్ అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేనకు తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పాలంపెల్లి ఆదర్శన్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. ఎస్జీటీలను ప్రభుత్వం గందరగోళానికి గురి చేయడం తగదని, వెంటనే పాత పాఠశాల నుంచి రిలీవ్ చేసి కొత్త పాఠశాలలో ఉపస్థితి అయ్యేలా చూడాలని కోరినట్లు వెల్లడించారు. అలాగే వివిధ కారణాలతో వారు కోరుకున్న ప్లేస్ కాకుండా ఇతర ప్లేసెస్ అలాట్ చేయబడిన టీచర్ల బదిలీ ఉత్తర్వులను సవరించి న్యాయం చేయాలని కోరగా సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ దేవసేన డీఈవోలకు తగిన సూచనలు, సలహాలతో ఉత్తర్వులు జారీ చేస్తానని చెప్పినట్లు వెల్లడించారు. బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్.శ్రీనివాస్, కట్టా రవీంద్రాచారిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషనలైజేషన్‌తో బదిలీలు నిర్వహించి మళ్లీ బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య, రిలీవర్ పేరుతో నిలువరించడం సరికాదని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి బదిలీఅయిన టీచర్లందరినీ రిలీవ్ చేయాలని కోరారు. పాఠశాలల్లో ఒక్క ఖాళీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీరో పాఠశాలలను తెరిచే ప్రయత్నం జరుగుతుండగా మరోవైపు ఉపాధ్యాయుల సంఖ్యను కుదిస్తూ జరిగిన రేషనలైజేషన్ విధానాన్ని ఖండిస్తూ సత్వరం టీచర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పరిహారం ఇవ్వకుండా పనులు



కరీంనగర్‌రూరల్: మండలంలోని ఇరుకుల్లలో చేపట్టిన జగిత్యాల–వరంగల్ జాతీయ రహదారి పనులు వివాదాస్పదంగా మారుతున్నాయి. రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే అధికారులు రోడ్డు పనులు చేపడుతున్నారు. గ్రామపరిధిలో సుమారు 70 మంది వరకు రైతులు భూములు కోల్పోతున్నారు. గతంలో కొందరు రైతులు పరిహారం కోసం రోడ్డు నిర్మాణపు పనులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించిన తర్వాతనే రోడ్డు నిర్మించాలని ఆందోళన చేయడంతో స్పందించిన అధికారులు కొంతమందికి పరిహారం మంజూరు చేశారు. మిగితా రైతులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూములు కోల్పోతున్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. కాలనీవాసులకు శాపం



తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని ఐదోవార్డులో గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నాలా కన్వర్షన్ చేయకుండానే వ్యవసాయ భూమిని భూ యజమానులు ప్లాట్లుగా విక్రయించారు. ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేసిన కొనుగోలుదారుల ప్లాట్లన్నీ రోడ్డుకు చాలా లోతుగా ఉండటంతో మట్టితో పూడ్చుకున్నారు. దీంతో మురుగుకాలువ, వర్షం ద్వారా వచ్చే నీరు వెళ్లడానికి అడ్డుకట్టలా మారింది. దీంతో నెలల తరబడి నీరు నిలుస్తోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు అంటున్నారు. దోమలతో కాలనీవాసులు డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇళ్లలోకి పాములు, కప్పలు, చెత్త వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.